

వేదోక్తంగా త్రిశూల స్నానం


త్రిశూల స్నానం

కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తిలో ఏటి ఉత్సవం వైభవంగా జరిగింది.స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానాన్ని వేదోక్తంగా నిర్వహించారు. వారం రోజుల ముందు నుంచే ముక్కంటి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి ప్రదేశాన్ని ముస్తాబు చేశారు. స్వామి అమ్మవార్ల మూల మూర్తులకు ఆలయంలో అభిషేకాలు నిర్వహించాక అలంకార మండపంలో పంచమూర్తులైన స్వామి, అమ్మవారు, వినాయక స్వామి, సుబ్రమణ్య స్వామి, చండీకేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. భక్తుల శివనామ స్మరణ మధ్య సద్యోముక్తి ప్రదేశానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు.జీవుడు శివసాయుజ్యం పొందేందుకు ఆచరించాల్సిన సద్యోముక్తి వ్రతకల్పాన్ని వేద పండితులు వివరించారు.ముక్కంటి ఆలయ అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ కలశ స్థాపనతో సంకల్ప పూజలతో పాటు త్రిశూలానికి విశేష పూజలు చేశారు. నదీ జలంలో త్రిశూల స్నానం నిర్వహించేటప్పుడు భక్తులు పుణ్యస్నానాలాచరించారు.అనంతరం చతుర్మాడ వీధుల్లో పంచమూర్తుల ఊరేగింపు వేడుకగా జరిగింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి




అట్టహాసంగా తిరుపతి జన్మదినం

● ఇకపై ఏటా టీటీడీ నిర్వహిస్తుందన్న భూమన




ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగర 894వ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.గోవిందరాజస్వామి గుడి మాడవీధుల్లో వివిధ కళాబృందాల సందడి నడుమ ఉత్సవాన్ని ప్రారంభించిన టీటీడీ ఛైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ.. క్రీ.శ. 1130 ఫిబ్రవరి 24వ తేదీన గోవిందరాజ స్వామి విగ్రహప్రతిష్ట జరిగిందని, ఆ రోజే రామానుజాచార్యులు తిరుపతి పుట్టుకకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇకపై ఏటా తిరుపతి పుట్టిన రోజు వేడుకను టీటీడీ అధికారికంగా నిర్వహిస్తుందని, ఈ మేరకు టీటీడీ క్యాలెండర్లో పొందుపరచడానికి పాలక మండలి తీర్మానిస్తుందని ప్రకటించారు.ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో టీటీడీకి చెందిన ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టుకు చెందిన వందలాది కళాకారులు పాల్గొన్నారు. ప్రదర్శనగా సాగిన కోలాటాలు, చెక్కభజనలు, గోవింద నామ సంకీర్తనా బృందాలు నగరవాసులకు కనువిందుచేశాయి.టీటీడీ జీయర్ స్వాములు,ఈవో ధర్మారెడ్డి,కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ మలిక గార్గ్, మేయర్ శిరీష, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి (కల్చరల్)

సమర్థతకు, యువతకు ప్రాధాన్యం

ఎన్నో రోజులుగా పార్టీ శ్రేణులు, రాజకీయ వర్గాలతో పాటు సామాన్య జనం కూడా ఆత్రుతగా ఎదురుచూస్తున్న తెలుగుదేశం పార్టీ తొలి అభ్యర్థుల జాబితా శనివారం వెలువడింది. జిల్లా నుంచీ గూడూరు అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను, సూళ్ళూరుపేట అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె డాక్టర్ విజయశ్రీని అధిష్ఠానం ప్రకటించింది. జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలుండగా తొలి జాబితాలో రెండు చోట్ల మాత్రమే అభ్యర్థులను ప్రకటించారు. సమర్థతకు, యువతకు అధిష్ఠానం ప్రాధాన్యత ఇచ్చిందని తొలి జాబితా వెల్లడిస్తోంది.తొలి జాబితాలో చోటు దక్కని మిగిలిన ఐదు స్థానాల గురించే ప్రధానంగా జనంలో చర్చ నడుస్తోంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

● రెండు స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన ● మిగిలిన స్థానాలను పెండింగ్ పెట్టడంపై చర్చ



గూడూరుకు పాశిం సునీల్ కుమార్

గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నిత్యం శ్రేణులతో వుంటూ జనం మధ్యే గడిపిన పాశిం సునీల్ కుమార్‌కు న్యాయం జరిగింది.ఎక్కడా శ్రేణుల్లో అసంతృప్తికి అవకాశమివ్వకుండా, జనం సమస్యలపై పోరాడిన సునీల్ కుమార్ తీరు మళ్ళీ టికెట్ దక్కేలా చేసింది. గూడూరులోనే నివాసముండడం, నిరంతరం పార్టీ శ్రేణులకు, ప్రజలకు అందుబాటులో వుండడం,పార్టీ కార్యక్రమాలను పూర్తిశక్తియుక్తులతో చేపట్టడం కూడా ఆయన పట్ల పార్టీలో మంచి అభిప్రాయం ఏర్పడేందుకు కారణమైంది. వర్గాలకు తావివ్వకుండా అందరినీ కలుపుకుని పోవడం, అందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడంతో శ్రేణుల్లో, ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసంతృప్తికి అవకాశం లేకుండా చేసింది. వీటితో పాటు గూడూరు టికెట్ కోసం ఇతరులెవరూ రేసులో లేకపోవడం కూడా ఆయనకు కలసి వచ్చింది. జాబితాలో ఆయన పేరు రావడంతో నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.

నారా లోకేశ్‌కు రుణపడివుంటా

నాపై నమ్మకం ఉంచి టికెట్ కేటాయించినందుకు యువనేత నారా లోకేశ్‌కు రుణపడి ఉంటా.వైసీపీ అధికారంలోకి వచ్చాక 15అక్రమ కేసులు పెట్టినా భయపడకుండా పార్టీ కోసం పనిచేశా. అంకితభావంతో పనిచేసేవారికి టీడీపీ అండగా నిలుస్తుందని చెప్పేందుకు ఈ రోజు నాకు టికెట్ కేటాయించడమే నిదర్శనం.మొదటి జాబితాలోనే 18మంది ఎస్సీలకు టిక్కెట్ కేటాయించారంటే దళితులకు చంద్రబాబు ఎంతటి గౌరవం ఇస్తారో మరోసారి వెల్లడైంది.

- పాశం సునీల్‌కుమార్

సూళ్ళూరుపేటకు డాక్టర్ విజయశ్రీ

సూళ్ళూరుపేట అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె డాక్టర్ విజయశ్రీని అదృష్టం వరించింది. వాస్తవానికి ఇక్కడ నెలవల సుబ్రమణ్యంతో పాటు మాజీ మంత్రి పరసా రత్నం కూడా టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించారు.రత్నం 2014, 2019 ఎన్నికల్లో ఓడిపోవడంతో పాటు గత ఎన్నికల అనంతరం పార్టీలో చురుకైన పాత్ర పోషించలేదు. అదే సమయంలో నెలవల సుబ్రమణ్యం టికెట్ రాకున్నా నాలుగున్నరేళ్ళుగా చురుగ్గా పనిచేస్తున్నారు. తనకు కాకుంటే తన కుమారుడు లేదా కుమార్తెల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని ఆయన చంద్రబాబును కోరారు. యువతకు ప్రాధాన్యమివ్వాలని భావించిన అధినేత విజయశ్రీవైపు మొగ్గు చూపారు. మహిళ, వైద్యురాలు కావడం ఆమెకు అనుకూలించింది. విద్యాధికురాలైన యువతికి టికెట్ ఇవ్వడం జనంలో పార్టీ ఇమేజిని పెంచినట్టయింది.

ఆ ఐదు స్థానాలపై చర్చ

టీడీపీ ఐదు స్థానాలను పెండింగులో వుంచడం జనంలో చర్చకు దారి తీసింది. తిరుపతి, శ్రీకాళహస్తి వంటి జనసేన, బీజేపీలతో పొత్తు బంధం ముడివేసుకున్న స్థానాలను పక్కన పెడితే పెద్దగా సమస్య లేని వెంకటగిరి, సత్యవేడు, చంద్రగిరి వంటి స్థానాలను కూడా పెండింగ్ పెట్టడం విస్మయానికి గురి చేసింది. తిరుపతిలో బలిజ సామాజికవర్గం అధికంగా వున్నందున తొలి నుంచీ ఈ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తారన్న అంచనా ఇరు పార్టీల్లోనూ వుంది. అయితే జనసేనకు బలమైన అభ్యర్థి లేకపోవడంతో టీడీపీ నుంచే ఉమ్మడి అభ్యర్థి బరిలో వుంటారన్న అంచనా మొదలైంది. దీంతో ఈ స్థానం పెండింగు పడడం అర్థం చేసుకోదగిందే.శ్రీకాళహస్తిలో టీడీపీ వైపు నుంచీ బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థిత్వం విషయంలో అనుమానాలేమీ లేవు. అయితే టీడీపీకి బీజేపీతో పొత్తు కుదిరే అవకాశమున్న సంగతి తెలిసిందే. ఇక్కడ బీజేపీకి కోలా ఆనంద్ బలమైన నాయకుడిగా వున్నారు. దీంతో పొత్తు కుదిరితే బీజేపీ ఈ సీటు అడిగేందుకు ఆస్కారమున్నందున శ్రీకాళహస్తి టికెట్ పెండింగ్‌లో పడింది. వెంకటగిరి విషయానికొస్తే టికెట్ కోసం ఇంచార్జిగా వున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, బీసీ నేత మస్తాన్ యాదవ్ రేసులో వున్నారు. వీరిలో ఎవరికి టికెట్ ఇవ్వాలన్నా మిగిలిన ఇద్దరికీ సర్దిచెప్పాల్సి వుంది. అందుకే తొలి జాబితాలో వెంకటగిరికి తావు లేకుండా పోయింది. సత్యవేడులోనూ ఇదే పరిస్థితి. ఇంచార్జి డాక్టర్ హెలెన్, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్య, జేడీ రాజశేఖర్ తదితరులు టికెట్ రేసులో వున్నారు. అభ్యర్థిగా ఎవరిని నిర్ణయించినా మిగిలిన వారిని బుజ్జగించాల్సిన అవసరముంది. అందుకే ఈ సీటు కూడా తొలి జాబితాలో కనిపించలేదు.చంద్రగిరి విషయానికొస్తే రకరకాల సమీకరణలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో పోటీ చేసిన పులివర్తి నానీ ఓటమి చెందినా నియోజకవర్గంలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని పెద్దఎత్తున పోరాడుతున్నారు. కుటుంబసభ్యులంతా జనంలోనే వుంటున్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ చంద్రగిరి నుంచీ పులివర్తి నానీని గెలిపించాలని శ్రేణులకు, ప్రజలకు కూడా పలుసార్లు పిలుపిచ్చారు. తొలి జాబితాలో నానీ పేరు ప్రకటిస్తారన్న అంచనాలు కూడా శ్రేణుల్లో వుండేవి. కానీ అలా జరగలేదు. తొలి జాబితాలో సెంటిమెంట్ కారణంగా 99 సంఖ్యకు ప్రాధాన్యత ఇచ్చారని, అందువల్లే మరిన్ని స్థానాల్లో స్పష్టత వున్నప్పటికీ జాబితాలో ప్రకటించలేదన్న వాదన పార్టీ వర్గాల నుంచీ వినిపిస్తోంది.



24 గంటలూ అందుబాటులో ఉంటా

నా అభ్యర్థిత్వానికి మద్దతు పలికిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.గెలిచి అందరి నమ్మకాన్నీ నిలబెడతా.నియోజకవర్గ ప్రజలకు 24గంటలూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ఈ ఎన్నికల్లో చంద్రబాబును మరోమారు ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. గతంలో టీడీపీకి వచ్చిన మెజార్టీ కన్నా రెండింతలు ఈ ఎన్నికల్లో సాధించేందుకు కృషి చేస్తాం.

- నెలవల విజయశ్రీ




ఆలయం వద్ద ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో వచ్చిన వాహనం - వాహనంలోని ప్లాస్టిక్ బాటిళ్లు, వాటిపై అధికారపార్టీ నేతల ఫొటోలు

ఇదేనా ప్లాస్టిక్ నిషేధం..!

● నిబంధనలకు విరుద్ధంగా తిరుమల చేరిన వాటర్‌బాటిళ్లు
● వాటిపై అధికార పార్టీ నేతల ఫొటోలు

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా టీటీడీ కొన్నేళ్ల క్రితమే ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల,కవర్ల విక్రయాన్ని తిరుమలలో నిషేధించిన విషయం తెలిసిందే. భక్తులెవరైనా తెలియకుండా తీసుకువస్తే అలిపిరి వద్ద తనిఖీల్లోనే సిబ్బంది స్వాధీన పరుచుకుంటారు. అయితే కొందరు వీఐపీలు ఇవేవీ తమకు వర్తించవనే రీతిలో ప్లాస్టిక్ బాటిళ్లను తరచూ తిరుమలకు తీసుకొస్తూనే వున్నారు. అధికారులు, సిబ్బంది కూడా వీఐపీ కార్లలో, గదుల్లో ప్లాస్టిక్ బాటిళ్లను గుర్తించినప్పటికీ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. తాజాగా 'ప్రధాన సలహాదారులు - రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ' అనే బోర్డుతో ఉన్న కారులో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు ప్రత్యక్షమయ్యాయి. పైగా నిబంధనలకు విరుద్ధంగా అధికారపార్టీ నాయకుల ఫొటోలు, సిద్ధం అనే నినాదంతో కూడిన సీఎం ఫొటోలు ఆ వాటర్ బాటిళ్లపై ఉండడం గమనార్హం. కారుపై ప్రొటోకాల్ అనే బోర్డు కూడా ఉండటంతో భద్రతాధికారులు నిబంధనలను మరిచిపోయారు. రాజకీయ పార్టీల గుర్తులు, జెండాలు, కరపత్రాలు, వ్యక్తుల ఫొటోలతో తిరుమలకు రావడం నిషేధం. పైగా ప్లాస్టిక్‌ను కూడా నిషేధించినప్పటికీ ఆ వాహనం నేరుగా ఆలయం వద్దకే రావడం చర్చనీయాంశమైంది.

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

● 27,894మంది అభ్యర్థులకు 61 కేంద్రాల్లో ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24 : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 61 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 27,894మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం మౌలిక వసతులు కల్పించింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కోట, గూడూరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. 31మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా, 61మందిని చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించారు. ఉదయం 9.30గంటలకల్లా అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపుకార్డు తీసుకురావాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు అనుమతించరు. ఒకవేళ ఎవరైనా తీసుకువస్తే పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో భద్రపరిచే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం జరగకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్‌తో పాటు ఒక ఏఎన్ఎంను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు అదనంగా సమయం ఉంటుందని తెలిపారు. నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు.


ఎస్వీడబ్ల్యూ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

87 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరంలేదన్న ఆర్ఐవో

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 24 : మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో శనివారం పరీక్షల నిర్వహణపై సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఒకటిన ప్రథమ ఇంటర్, 2న ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని, 87 కేంద్రాల్లో 63,250మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. హాల్‌టికెట్లు ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఆర్ఐవో కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నెంబరు 0877-2237200కి ఫోన్ చేయాలని కోరారు. డీవీఈవో విశ్వనాథనాయక్,డీఈసీ సభ్యులు గోపాల్‌రెడ్డి, రఘుపతి,తులసీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు ముఖ్య గమనిక

రేపు శాంతిపురంలో సీఎం సభ

బస్సు ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదంటున్న విశ్లేషకులు

ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఎవరైనా సోమవారం ప్రయాణాలు పెట్టుకుని ఉంటే.. వాయిదా వేసుకోవడమే మంచిది. లేదంటే బస్టాండ్లలో పడిగాపులు పడాల్సిందే. ఎందుకంటే శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో సీఎం జగన్ బహిరంగ సభ ఉంది. అత్యధిక బస్సులన్నీ అటువైపే వెళ్తాయి. రాష్ట్రంలో సీఎం జగన్ సభ అంటేనే ప్రయాణికులు బెంబేలెత్తే పరిస్థితి. పార్టీ సభ అయినా, ప్రభుత్వ కార్యక్రమమైనా నలుమూలల నుంచి జనాలను తరలించడం పరిపాటిగా మారింది. దీనికోసం ఆర్టీసీ, ప్రైవేటు, స్కూల్ బస్సులను ముందు రోజే స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక స్కూళ్లకైతే సెలవు ప్రకటించాల్సిందే. ఇటీవల రాప్తాడు సభకూ ఆర్టీసీ బస్సులను మళ్లించడంతో రెండు రోజుల పాటు జిల్లాలోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సోమవారం శాంతిపురం మండలంలో సీఎం జగన్ సభ ఖరారైంది. దీంతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, కడప జిల్లాల నుంచి సుమారు 900 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. అలాంటప్పుడు సాధారణ ప్రజలు ప్రయాణించేందుకు బస్సులు ఎక్కడుంటాయి? అందుకే ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదంటున్నారు విశ్లేషకులు.

- చిత్తూరు రూరల్

ఐదు చోట్ల టీడీపీ అభ్యర్థులు

ఖరారు

కుప్పం, పలమనేరు, జీడీనెల్లూరు, నగరిలో ఇప్పటికే ప్రకటన

చిత్తూరుకు కొత్త అభ్యర్థి గురజాల జగన్మోహన్



అమరనాథరెడ్డి, చంద్రబాబు, గాలి భానుప్రకాష్, థామస్, జగన్మోహన్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ జోరు పెంచింది. చిత్తూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒకేసారి ఐదు చోట్ల ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేయడంతో సందడి ఊపందుకుంది. పూతలపట్టు, పుంగనూరు మినహా అభ్యర్థులు ఖరారయ్యారు. కుప్పం చంద్రబాబు, పలమనేరు అమరనాథరెడ్డి, జీడీనెల్లూరు డాక్టర్ థామస్, నగరి గాలి భానుప్రకాష్ విషయాల్లో ఇదివరకే స్పష్టత ఉండగా, చిత్తూరు అసెంబ్లీ స్థానానికి కొత్త అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను ప్రకటించారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పూతలపట్టు, పుంగనూరు సందిగ్ధం

చంద్రబాబు శనివారం ప్రకటించిన జాబితాలో పూతలపట్టు, పుంగనూరు అభ్యర్థులు లేరు. దీంతో ఆ రెండు చోట్ల సందిగ్ధత నెలకొంది. పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మురళీమోహన్‌ను గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పూతలపట్టులో భారీ బహిరంగ సభ కూడా నిర్వహించారు. ఇన్‌ఛార్జిగా ప్రకటించినప్పటి నుంచి మురళి కూడా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన విషయంలో మార్పులు ఉండకపోవచ్చని పార్టీ పెద్దలు అంటున్నారు. ఓ వైపు జనసేన, మరోవైపు బీజేపీ పొత్తు కారణంగా టీడీపీ అధిష్ఠానం అక్కడక్కడా కొన్ని సీట్లను ప్రకటించలేదు. ఈ క్రమంలోనే పుంగనూరు అభ్యర్థిని ప్రకటించకుండా వాయిదా వేసిందా అనే చర్చలు స్థానికంగా నడుస్తున్నాయి. ఇక పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మంత్రి పెద్దిరెడ్డితో నిత్యం పోరాడుతున్నారు. ఆయన పేరు ఎందుకు ప్రకటించలేదా అనే చర్చ కూడా నడుస్తోంది.

తండ్రిలాగే.. అందరికీ అందుబాటులో ఉంటూ..

నగరిలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడి పెద్ద కుమారుడు గాలి భానుప్రకాష్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. తన తండ్రి హయాంలోనే నియోజకవర్గంలోని శ్రేణులకు సన్నిహితంగా మెలిగారు. 2019లో అశోక్ రాజు, గాలి జగదీష్‌తో హోరాహోరీ పోటీ ఉన్నప్పటికీ అధిష్ఠానం చివరి దశలో గాలి భానుప్రకాష్‌ను ప్రకటించింది. 2800 స్వల్ప ఓట్ల తేడాతో రోజా చేతిలో ఓటమి చెందారు. అప్పటి నుంచి నియోజకవర్గంలోని శ్రేణులకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. తండ్రి తరహాలోనే నిరుపేదల ఇళ్లల్లో జరిగే కార్యక్రమానికీ హాజరై.. అన్ని వర్గాల నుంచీ ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు. గత ఎన్నికల్లో త్రుటిలో తప్పిన విజయాన్ని ఈసారి మంచి మెజార్టీతో సాధించాలని శ్రేణులు ఈయన కోసం గట్టిగా పనిచేస్తున్నారు.

గురజాలకే అని ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

కీలకమైన జిల్లా కేంద్రం చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాలకు చిత్తూరు టికెట్ వస్తుందని ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది. 'గురజాల జగన్మోహన్‌కు మెరుగైన అవకాశాలు' శీర్షికతో జనవరి 29న ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో కథనాన్ని ప్రచురించింది. 2019 ఎన్నికల తర్వాత ఏఎస్ మనోహర్ బయటికి వెళ్లిపోయినప్పటి నుంచి ఇక్కడ టీడీపీ ఇన్‌ఛార్జి పోస్టు ఖాళీగా ఉంది. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ వచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చిత్తూరు టికెట్ కోసం విపరీతమైన పోటీ పెరిగింది. సీకే బాబు దంపతులు సహా డీకే కుటుంబం, కటారి హేమలత, చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్.. ఇలా చాలామంది తెరపైకి వచ్చారు. బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఆరు నెలల కిందట వచ్చిన గుడిపాలకు చెందిన గురజాల జగన్మోహన్ చిత్తూరు టీడీపీలో ఊపు తీసుకొచ్చారు. విద్య, వైద్య అవసరాల కోసం వచ్చినవారికి ఆర్థిక సాయంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు చేస్తూ తక్కువ సమయంలోనే వెలుగులోకి వచ్చారు. పోటీ మరీ ఎక్కువ కావడంతో దొరబాబు ఆరుగురు ఆశావహులతో బృందాన్ని ఏర్పాటుచేసి ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ చేసిన ఐవీఆర్ఎస్ సహా అన్నిరకాల సర్వేలో గురజాల జగన్ పేరు రావడంతో అతడి పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత అభిమానులు, టీడీపీ కార్యకర్తలు శనివారం మురకంబట్టు సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకు భారీఎత్తున ర్యాలీ చేశారు.

లక్ష మెజార్టీ లక్ష్యంతో

టీడీపీ అధినేత చంద్రబాబు 8వసారి కుప్పం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు. 1989 నుంచి వరుసగా పోటీ చేసి గెలుస్తున్న విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో మెజార్టీ తగ్గడంతో ఈసారి ఇక్కడ లక్ష మెజార్టీ లక్ష్యంగా టీడీపీ నాయకులు, శ్రేణులు పనిచేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అక్రమ ఏకగ్రీవాలు చేసుకోవడం, యాక్టివ్‌గా ఉండే టీడీపీ శ్రేణుల మీద తప్పుడు కేసులు వేధించడంతో నియోజకవర్గంలోని శ్రేణుల్లో కసి పెరిగింది. ఈసారి కచ్చితంగా తమ నాయకుడికి లక్ష మెజార్టీతో గెలిపించి బహుమతిగా ఇవ్వాలనే తలంపుతో పనిచేస్తున్నారు.

రాజకీయాలకు కొత్తయినా దూసుకుపోతూ..

జీడీనెల్లూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఇప్పటికే ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ థామస్‌ను ప్రకటించారు. వృత్తి రీత్యా ఫెర్టిలిటీ విభాగ వైద్యుడైన థామస్.. చంద్రబాబు పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చారు. ఈయన సొంతూరు కార్వేటినగరంలోని అల్లాగుంట గ్రామం కావడం, నియోజకవర్గంలో పిల్లలు లేని జంటలకు ఈయన ఫెర్టిలిటీ సెంటర్‌లో సంతాన భాగ్యం కలిగించడం వంటి కారణాలతో ఇక్కడి నాయకులకు, ప్రజలకు త్వరగా చేరువయ్యారు. థామస్‌ను గతేడాది జూన్ 1వ తేదీన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అధిష్ఠానం ప్రకటించడంతో అప్పటి నుంచి ఆయన విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే నారాయణస్వామి దళితుల ఆత్మగౌరవాన్ని రెడ్ల వద్ద తాకట్టు పెట్టాడనే నినాదంతో ముందుకు వెళుతున్నారు. దీంతో పాటు వైసీపీ అధిష్ఠానం ఇక్కడ ఓసారి రెడ్డెప్ప అని, మరోసారి నారాయణస్వామి అని ప్రకటించింది. ఇప్పుడు పద్మజ అనే కొత్త పేరు ప్రచారంలో ఉంది. దీంతో వైసీపీ దళిత అభ్యర్థుల్ని అవమానిస్తోందని నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారు.

ఇప్పటికే 'ఇంటింటికి టీడీపీ' పూర్తి

కుప్పం తరహాలోనే పలమనేరు అభ్యర్థి విషయంలోనూ ముందు నుంచీ క్లారిటీ ఉంది. ఇప్పుడు అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. 2019 ఎన్నికల్లో అమరనాథరెడ్డి ఓడిపోయినా, ఈసారి నాలుగు నెలలు ముందు నుంచే ఇంటింటికి టీడీపీ పేరుతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లారు. ప్రతి మండలంలోనూ ఆయన ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు వలస వచ్చారు. ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు కూడా 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పనిచేస్తున్నారు. ఈయన జిల్లా టీడీపీకి పెద్దదిక్కుగా ఉంటూ, అభ్యర్థుల కసరత్తు విషయంలో రాయలసీమ కోఆర్డినేటర్‌గానూ వ్యవహరించారు. గతేడాది నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి జిల్లా దాటేవరకు లోకేశ్‌కు తోడుగా నడిచారు.

మంగళం ప్రజలకు చెవిరెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయి:టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 24:ఉమ్మడి మంగళం పంచాయతీ ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని స్థానిక టీడీపీ నేతలు ప్రశ్నించారు.తిరుమలనగర్, మంగళం పంచాయతీల అధ్యక్షులు గోవింద రాజులు, సురేష్‌నాయుడు శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే తెలుగుగంగ నీరందిస్తామని చెప్పిన చెవిరెడ్డి హామీ ఏమైందన్నారు.ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో టీడీపీ హయాంలో పులివర్తి నాని కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను ఇచ్చి ఇప్పటివరకు స్థలాలను చూపలేని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఉమ్మడి మంగళం పంచాయతీ టీడీపీ అధ్యక్షులు ఈశ్వరయ్య, గోపీనాథ్, పెరుగు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులుయాదవ్, చిన్నరాయప్ప, ఢిల్లీబాబు, రాధాకృష్ణ, జనజ్యోతి, రామకృష్ణ, పట్టాభి, సుధ, రవిచంద్ర, చలపతి, నాగసూరి, బాలాజీ, పాలచంద్ర, జడ భాస్కర్‌రెడ్డి, అల్లాబాషా, సుబ్బుయాదవ్, స్థానిక జనసేన పార్టీ అధ్యక్షులు కిషోర్, దామోదరం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

29లోపు వ్యాపారులు లైసెన్సులు పొందాలి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి24: తిరుపతి జిల్లాలో వ్యాపార సంస్థలు, దుకాణాలు నిర్వహిస్తున్న యజమానులు ఈ నెల 29వ తేదీలోపు తమ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.బాలానాయక్ విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులు సచివాలయాల్లో లభిస్తాయని తెలిపారు.

సర్పంచ్ భర్త ఆత్మహత్య



నాగరాజుయాదవ్ (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, ఫిబ్రవరి 24: ఏర్పేడు మండలం సీతారాంపేట సర్పంచ్ నిర్మల భర్త నాగరాజుయాదవ్ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీతా రాంపేట గ్రామానికి చెందిన నాగరాజు శ్రీకాళహస్తి మండలం వెల్లం పాడు వద్దనున్న సోమాని టైల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఉద్యోగి. వైసీపీలో చురుకైన నాయకుడు. కొద్దిరోజులుగా ఇంట్లో కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఆయన భార్య నిర్మల తిరువణ్ణామలై వెళ్లింది. ఈ సమయంలో సీతారాంపేట వద్దనున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



చంద్రగిరి, ఫిబ్రవరి 24: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి గరుడ వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై తనిఖీ

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శనివారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తనిఖీ చేశారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో పుష్పాలంకరణలు, ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ముందస్తుగా క్యూలైన్లు, చలువ పందిళ్ళు, అన్ని కూడళ్లలో ఫ్లెక్సీ బోర్డులు, విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో వివిధ దేవతామూర్తుల కటౌట్లు, విద్యుద్దీపాలంకరణలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన మేరకు శ్రీవారి సేవకులను అందుబాటులో ఉంచాలని చీఫ్ పీఆర్వో రవికి సూచించారు. డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఎలక్ట్రికల్ ఎస్ఈ వేంకటేశ్వర్లు, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, ఈఈలు మనోహర్, ప్రసాద్, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరినాథ రెడ్డి, గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, అదనపు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సునీల్‌కుమార్, ఏఈవో గోపినాథ్, ఏవీఎస్వో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్థల విషయమై దాడి

● ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24: తిరుపతి నగరం కొరమేను గుంట ప్రాంతంలో తాము ఓ గది నిర్మించుకుంటుండగా కొందరు అడ్డుకున్నారని, ప్రశ్నించినందుకు తమపై దాడిచేశారని బాధితులు ఈస్ట్ పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ పురుషోత్తంరెడ్డికి అందిన ఫిర్యాదు ప్రకారం... కొరమేనుగుంట ప్రాంతంలోని హీరోహోండా షోరూమ్ పక్కనే ఉన్న 60 అడుగుల రోడ్డులో ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామ నివాసులు ఎస్.మస్తానమ్మ, సుందర నాయుడు దంపతులకు 33 అంకణాల స్థలం ఉంది. ఆ స్థలంలో ఓ గదిని నిర్మించుకుంటుండగా శనివారం సమాధి సాయి, హేమంత్, మహేష్‌లతో పాటు మరో 20 మంది వచ్చి ఆ స్థలం తమదేనంటూ దౌర్జన్యానికి దిగారు. ఇంటి గోడను కొంతమేర కూల్చేశారు. దీనిని ప్రశ్నించినందుకు స్థల యజమానులు, వారి కుమారుడు ప్రశాంత్, బావమరిది పవన్‌పై దాడికి పాల్పడ్డారు.తమకు మేయర్ సపోర్ట్ ఉందంటూ వారు బెదిరించారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఈస్ట్ ఎస్ఐ పురుషోత్తంరెడ్డి తెలిపారు.

చంద్రగిరి

రుయాలో నేడు క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 24 : కేంద్ర ప్రభుత్వ నిధులతో రుయాస్పత్రి ఆవరణలో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం 4-6గంటల మధ్యలో ప్రారంభిస్తున్నట్లు రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో దీనికి సంబంధించి లైవ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశామన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి):శ్రీవారిని శనివారం శ్రీలంక డిప్యూటి హై కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీ కోటగిరి శ్రీధర్, సంగీత దర్శకుడు రవి బస్రూర్ దర్శించుకున్నారు.

ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి





తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం కుమారధార తీర్థ ముక్కోటి ఘనంగా నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయానికి వాయవ్యదిశలో వెలసి ఉన్న కుమారధార తీర్థ ముక్కోటికి భక్తులు భారీగా తరలివచ్చారు. మాఘ మాసంలో పౌర్ణమి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులను శనివారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీర్థానికి అనుమతించారు. భక్తిశ్రద్ధలతో గోవిందనామస్మరణ చేసుకుంటూ తీర్థానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ వెలసి ఉన్న కుమారస్వామిని దర్శించుకుని హారతులు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్న ప్రసాదాలు, తాగునీరు ఏర్పాటు చేసింది. పటిష్ఠమైన భద్రత కల్పించారు.

27న జయహో బీసీ సభను విజయవంతం చేద్దాం



బుక్‌లెట్ చూపుతున్న టీడీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 24 : తిరుపతిలో ఈనెల 27న నిర్వహించనున్న జయహో బీసీ సభను విజయవంతం చేయాలని టీడీపీ నేతలు జిల్లాలోని బీసీలకు, కమిటీలకు, సంఘాలకు పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు అండగా ఉన్నారని, ఇందుకు తగినట్లే పార్టీలో కూడా వారికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వైసీపీ పాలనలో చేతివృత్తుల వారికి కనీసం పనిముట్లు అందించలేదని దుయ్యబట్టారు. గత టీడీపీ పాలనలో ఆదరణ పథకం ద్వారా చేతివృత్తుల వారికి అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. వైసీపీలో బీసీలకు అన్యాయం జరుగుతోందని గుర్తించి జంగా కృష్ణమూర్తి ఆ పార్టీకి రాజీనామా చేశారన్నారు. అన్ని బీసీ కులాలు సంఘటితమై రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం వైసీపీ అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సంఘాల నాయకులు ఆముదాల తులసీదాస్, మధుసూదన్ యాదవ్, అశోక్, మనోహరాచారి, రామచంద్రాచారి, రెడ్డెప్ప, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



ప్రేమతోనే భగవంతుడిని తెలుసుకోవచ్చు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 24 : ప్రేమద్వారానే భగవతుడిని తెలుసుకోగలుగుతామని రామకృష్ణ మఠం కేంద్ర కార్యాలయం బేలూరు మఠం(కలకత్తా) ఉపాధ్యక్షుడు గౌతమానంద అన్నారు. తిరుపతి వినాయకనగర్ వద్ద ఉన్న రామకృష్ణ ఆశ్రమం ఆవరణలో నూతనంగా నిర్మించిన శారదా నిలయా (సాధునివాసం)న్ని శనివారం ఉదయం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సైన్సుకు దీటుగా మతం, దేవుడు అనే విషయాలను రుజువు చేసినవాడు రామకృష్ణ అని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో సాధన చేసిన వివేకానందుడు వంటి వారికి భగవత్ సాక్షాత్కారం లభించిందని గుర్తు చేశారు. బేలూరు మఠం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ సత్యేశానంద, బెంగలూరు మఠానికి చెందిన ఆత్మవిధానంద, తిరుపతి ఆశ్రమ సమితి అధ్యక్షుడు పి.వి.రెడ్డి తదితరులు ప్రసంగించారు. భవన నిర్మాణం కోసం విరాళం అందించిన డాక్టర్ వసుంధర, ఆర్కిటెక్ట్‌లను సత్కరించారు. కాగా టీటీడీ పాలక మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి శనివారం సాయంత్రం ఆశ్రమంలో జరుగుతున్న కార్యక్రమాలను వీక్షించి, గౌతమానందతో సమావేశమయ్యారు.

కోమలమ్మను గౌరవించండి

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 24: శ్రీవారి పరమ భక్తురాలు, భక్తుల కోసం దానధర్మాలు చేసిన వితరణశీలి కోమలమ్మను టీటీడీ తగిన విధంగా గౌరవించాలని రాయలసీమ పోరాట సమితి నేత నవీన్‌కుమార్ రెడ్డి కోరారు. శనివారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద తిరుపతి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అలిపిరి నడక మార్గంలో మొదట్లోనే కోమలమ్మ విగ్రహం ఉందని, సరైన నిర్వహణ లేకపోవడం, వివరాలు లభించకపోవడంతో ఈ ప్రతిమను ఎవరూ గుర్తించలేకపోతున్నారని తెలిపారు. శ్రీవారి భక్తుల సేవ కోసం కోమలమ్మ ఎంతో స్థలం దానం చేశారన్నారు. ఆమె పేరుతో పాత ప్రసూతి ఆస్పత్రి సమీపంలో సత్రం ఉందని, అలాగే రాముల వారి ఉత్సవం కోసం పూలతోట కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇంతటి భక్తురాలి వివరాలు ఈ తరానికి తెలిసే విధంగా టీటీడీ ఏర్పాట్లు చేయాలని కోరారు.

రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 24 : రుయాస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పలు వైద్య విభాగాల పరిధిలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని, ఇకపై సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించే విధంగా ప్రభుత్వం ఇటీవల దాదాపు పది విభాగాలకు పైగా వైద్య నిపుణులను నియమించిందని పేర్కొన్నారు. ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన వారాల్లో ఆ విభాగాల వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు ఓపీ సేవలు అందిస్తారని తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

వారం	గది నంబరు 11	గది నంబరు 20	గది నంబరు 21
సోమవారం	యూరాలజీ	నెఫ్రాలజీ	కార్డియాలజీ
మంగళవారం	న్యూరోసర్జరీ	అంకాలజీ	న్యూరాలజీ
బుధవారం	ప్లాస్టిక్ సర్జరీ	సీటీసర్జరీ	కార్డియాలజీ
గురువారం	యూరాలజీ	నెఫ్రాలజీ	---------
శుక్రవారం	న్యూరోసర్జరీ	అంకాలజీ	కార్డియాలజీ, న్యూరాలజీ
శనివారం	ప్లాస్టిక్ సర్జరీ	సీటీసర్జరీ	---------

కన్నులపండువగా పౌర్ణమి గరుడసేవ



తిరుమలలో శనివారం పౌర్ణమి గరుడసేవ కన్నులపండువగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున టీటీడీ గరుడసేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య మలయప్పస్వామి విశేష అలంకరణలో తన ఇష్టవాహనమైన గరుడ వాహనమెక్కి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. శని, ఆదివారాలు వరుస సెలవులు కావడంతో భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య గరుడోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు గోవింద నామస్మరణతో కర్పూర నీరాజనాలు సమర్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24: అలిపిరి సీఐగా ఒ.రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా నమోదైన కేసులను విచారణ లేకుండా మూసివేశారన్న ఆరోపణలతో గతంలో అలిపిరి సీఐగా పనిచేసిన అబ్బన్నను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. కొన్ని రోజులుగా ఖాళీగా ఉన్న సీఐ స్థానాన్ని తిరుపతి సైబర్ వింగ్ సీఐగా ఉన్న రామచంద్రారెడ్డితో భర్తీ చేశారు.

దళిత, గిరిజన ప్రాంతాల్లో ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

చంద్రగిరి,ఫిబ్రవరి 24: చంద్రగిరి మండలంలోని దళిత, గిరిజన ప్రాంతాల్లో అందరికీ ఓటు హక్కు కల్పించడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మారుతి తెలిపారు.మండలంలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో ఓటు హక్కు పొందలేని దళిత, గిరిజనులను గుర్తించామన్నారు. చిన్నరామాపురం, భీమవరం ఎస్టీ కాలనీల్లో 17 మందికి ఓటు కల్పించడానికి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. అదేవిధంగా దళిత, గిరిజన కాలనీలకు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటంతో తమ ఓటు హక్కును అనేకమంది వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు.వారికోసం పోలింగ్ కేంద్రాలకు వాహన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని తాటికోన, బోనాకాలువ ఎస్టీ కాలనీలను అధికారులు సందర్శించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల సెక్టార్ ఆఫీసర్ శైలజ, సూపర్‌వైజర్ స్వర్ణలత, సర్వేయర్ పురుషోత్తంరెడ్డి, వీఆర్వోలు వాసు, హరి, బీఎల్వోలు కవిత పాల్గొన్నారు.

నేడు చంద్రగిరిలో జల్లికట్టు

చంద్రగిరి, ఫిబ్రవరి 24: చంద్రగిరి పట్టణంలో మొదటిసారిగా మిట్టమీద గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం ఉదయం 11 గంటలకు జల్లికట్టు నిర్వహించనున్నట్లు మొక్కల చంద్రశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.జల్లికట్టు నిర్వహణకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.50 వేల విరాళం ప్రకటించగా శనివారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆ విరాళాన్ని అందజేశారు.

ఒకటి నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 24: కపిలేశ్వరస్వామి ఆలయంలో మార్చి ఒకటి నుంచి 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ తెలిపింది. పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి శనివారం సాయంత్రం తన నివాసంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈనెల 29వ తేదీన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని, ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 9, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయని టీటీడీ పేర్కొంది. మార్చి 10న త్రిశూల స్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపింది.

నేడు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 24: ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా సమావేశం ఎయిర్‌బైపాస్ రోడ్డులోని మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఏపీ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు, ప్రముఖ సినీ నిర్మాత ఎం.ఎం.రత్నం, ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్ హాజరుకానున్నట్లు దర్శకుడు రవిచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 24: బెంగళూరు పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని ఎంజీఎం హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేశారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ ప్రారంభించగా సంఘం అధ్యక్షుడు వంక అవినాష్, ఉపాధ్యక్షులు అవినాష్‌రాయల్, కార్యదర్శి సాయివినయ్, నరసింహ, యాసిన్, షేక్‌ఫైజల్, అనంతకల్యాణ్, జ్యోతిష్, శివుడు, నవీన్, అన్వేష్, లోకేష్ 150మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. జనసేన జిల్లా కార్యదర్శి ఆనంద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎన్ఎస్‌యూ పూర్వ విద్యార్థుల ఎంపిక



ఒడిస్సా ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన ఎన్ఎస్‌యూ పూర్వవిద్యార్థులు

తిరుపతి (విద్య), ఫిబ్రవరి 24: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో 2020-22 విద్యా సంవత్సరంలో బి. ఎడ్ కోర్సు చదివిన ఒడిశా రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఆ రాష్ట్ర ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు శిక్షణ విభాగం హెడ్ ప్రొఫెసర్ కాదాంబిని పేర్కొన్నారు. ఒకేసారి తమ విద్యార్థులు 20మంది ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్జే రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ ఎన్.లత అధ్యాపకులు అభినందించారు.

ఉద్యోగాలకు ఎస్వీ పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి, హెడ్లు బోసుబాబు, డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి24: కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల డిప్లొమా కంప్యూటర్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు బెంగళూరుకు చెందిన థాట్‌వర్క్స్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. తమ విద్యార్థులు కె.భానుతేజ, వి.జయంత్, వి.మేఘశ్యామ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.8లక్షలు ఉంటుందని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కంప్యూటర్స్ విభాగ హెడ్ జి.బోసబాబు, జనరల్ విభాగ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా ఎస్వీ హైస్కూల్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 24: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ హైస్కూల్ క్రీడా, వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన టీటీడీ డీఈవో డాక్టర్ భాస్కరెడ్డి మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికలు ఆచరించాలని తెలిపారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్‌సీడీ ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎన్ పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యం, విద్య, నైపుణ్యాల అవశ్యతకని వివరించారు. వివిధ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టీటీడీ హెడ్‌డీపీపీ కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్‌కుమార్, హెచ్‌ఎం జె.సంధ్య, టీచర్లు పాల్గొన్నారు.

అలిపిరిలో స్థానికుల హక్కుల కమిటీ అన్నదానం



తిరుపతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అలిపిరి శ్రీవారి పాదాల చెంత తిరుపతి నగర ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానికుల హక్కుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రముఖులంతా కలసి టెంకాయలు కొట్టి, గోవిందనామ స్మరణతో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డీఎంసీ భాస్కర్, ఈతమాకుల హేమంత్ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, నవీన్ కుమార్ రెడ్డి, పెనుబాల చంద్రశేఖర్ మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీవారి కొలువు మండపాల కోసం పూలతోటలను వితరణగా ఇచ్చిన వారి చరిత్ర నేటితరంతో పాటు, భవిష్యత్ తరాలవారికి తెలిసేలా టీటీడీ పుస్తకాలు ప్రచురించి భక్తులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహయాదవ్, లక్ష్మయ్య యాదవ్, తులసీ యాదవ్, సుబ్రమణ్యం యాదవ్, గుండాల గోపీనాథ్, చోడా మధు, వరప్రసాద్, మహేష్ రెడ్డి, జీఎంకే నారాయణ పాల్గొన్నారు.

జేసీ బాబుకు సామాజిక సేవా పురస్కారం



బాబుకు పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, అపుస్మా నేతలు విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 24: తిరుపతికి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, జేసీఐ ప్రతినిధి ఎం.బాబుకు ఏపీ ప్రైవేట్ అండ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఆధ్వర్యంలో విశిష్ట సామాజిక సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. సామాజిక సేవ, విద్యా రంగ అభివృద్ధికి బాబు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఇటీవల రవీంద్రభారతి స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వచ్చిన ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, డీఈవో డాక్టర్ వి.శేఖర్‌లతో అపుస్మా రీజియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.హరినాథశర్మ, నగర అధ్యక్షుడు బి.రవీంద్రనాథరెడ్డి, సెక్రటరీ ఓ.వెంకటరమణారెడ్డి కలసి ఈ పురస్కారాన్ని అందించారని ప్రకటించారు. కరస్పాండెంట్లు వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఆనంద్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, విశ్వచందన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభకు అనుమతివ్వండి

తుడా వీసీకి నేతల వినతి



తుడా వీసీకి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 24: కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ ఆధ్వర్యంలో మార్చి 1న తిరుపతిలో నిర్వహించే బహిరంగ సభకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొంటారని, దీనికి అనుమతి ఇవ్వాలని తుడా వీసీ వెంకటనారాయణ, తిరుపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్యను కలిసి కాంగ్రెస్ నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు నగరంలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానం, ఇందిరా మైదానాన్ని పరిశీలించారు. పార్టీ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, నాయకులు రవి, సమీవుల్లా, మున్వర్, రమేష్‌రెడ్డి, మహేష్‌రాయల్, భాస్కర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంట్రామ్యూరల్స్ అథ్లెటిక్ మీట్



తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 24: ఎస్వీయూ మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంట్రామ్యూరల్స్ అథ్లెటిక్ పోటీలు శనివారం ముగిశాయి. ఏటా అకడమిక్ ఇయర్ ముగింపులో ఈ పోటీలు నిర్వహిస్తుంటారు. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. మెన్, ఉమెన్ విద్యార్థులు, టీచింగ్‌స్టాఫ్‌కు పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్ వంటి పోటీలు నిర్వహించి, ప్రతిభ చాటిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.03 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.03 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 62,880 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,904 మంది తలనీలాలు సమర్పించారు.

తిరువణ్ణామలైకు తగ్గిన ప్రయాణికులు

తిరుపతి(కొర్లగుంట),ఫిబ్రవరి24:తమిళనాడు తిరువణ్ణామలైకు ప్రయాణికుల సంఖ్య తగ్గినట్లు ఆర్టీసీ గణాంకాలు చెబుతున్నాయి. ప్రతినెలా పౌర్ణమి రోజున తిరువణ్ణామలై గిరిప్రదక్షిణ చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వెళుతుంటారు. దానికి తగినట్లు ఆర్టీసీ యంత్రాంగం బస్సులను నడుపుతుంది.ప్రతినెలా 150బస్సులను కేటాయిస్తుండగా గడిచిన రెండు పర్యాయాలు రద్దీ తగ్గింది. గతనెల 90బస్సులు వెళ్లాయి.ఈనెలకు గాను శుక్ర, శనివారాల్లో 150 బస్సులు కేటాయించగా 114 వెళ్లాయి. రద్దీ లేని కారణంగా అధికారులు కొన్ని బస్సులను రద్దు చేశారు.

పాలిసెట్2కే24కి దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య),ఫిబ్రవరి24: రాష్ట్రంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే ఏపీపాలిసెట్-2కే24కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి కోరారు.ఈనెల20నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభమైందని, ఏప్రిల్ 4వ తేదీతో గడువు ముగుస్తుందని వివరించారు. ఏప్రిల్ 27న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌బీటీఈటీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ని సందర్శించాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా అధ్యాపకుడి పదోన్నతికి ఫైల్ సిద్ధం

నేడు ఎస్వీ వేదవర్సిటీ పాలకమండలి సమావేశం - అకడమిక్ కౌన్సిల్ అప్రూవల్ లేకుండానే పలు కీలక నిర్ణయాలు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి24:టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేదవర్సిటీ పాలకమండలి(ఈసీ) సమావేశం వర్సిటీవీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి అధ్యక్షతన ఆదివారం జరగనుంది.దాదాపు 20కిపైగా అజెండాలనుప్రవేశపెట్టి ఈసీ అనుమతితోఆమోదం పొందనున్నట్లు తెలిసింది. అయితే వర్సిటీలో 2022లో అడహక్ పద్ధతిలో నియమితులైన ఒక రెగ్యులర్ అధ్యాపకుడికి నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతి కల్పించేందుకు ఫైల్ సిద్ధం చేశారని ప్రచారం జరుగుతోంది. జిల్లాకు చెందిన ప్రముఖ వైసీపీ ఎమ్మెల్యే కుమారుడి సిఫారసుపై ఈసీ ఆమోదానికి ఈ అజెండాను పెట్టారని సమాచారం. సాధారణంగా అధ్యాపకులకు పదోన్నతి కల్పించేందుకు రిఫ్రెషర్ కోర్సు, ఓరియంటేషన్‌ను పరిగణనలోకి తీసుకుని అర్హత కల్పిస్తారు. అయితే ఆ అధ్యాపకుడికి ఈ అర్హత లేకున్నా పదోన్నతి కల్పించేందుకు ఉన్నతాధికార వర్గాలు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. దీనిపై వర్సిటీ రిజిస్ట్రార్ కూడా వ్యతిరేకంగా రాసినా పట్టించుకోకుండా పదోన్నతి ఫైల్‌ని అజెండాలో పొందుపరిచినట్లు సమాచారం. వర్సిటీలో 15సంవత్సరాలుగా పనిచేసే అధ్యాపకులకు మూడుసంవత్సరాలుగా సీఏఎస్ పదోన్నతులు పెండింగ్‌లో ఉండగా 2022లో నియమితులైన అధ్యాపకుడికి అర్హత లేకున్నా పదోన్నతి కల్పించేందుకు ఫైల్ సిద్ధం చేయడంలో ఆంతర్యమేమిటన్నది వర్సిటీ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. అలాగే వేదవర్సిటీకీ అనుబంధంగా ఉన్న ధర్మగిరి పాఠశాలలో పనిచేసే గెస్ట్ టీచర్లకు(కాంట్రాక్ట్) రూ.54వేల వేతనం అందిస్తుండగా అదేతరహాలో వర్సిటీలో పనిచేసే గెస్ట్ ఫ్యాకల్టీ(కాంట్రాక్ట్)కి కేవలం దానిలో సగం రూ.25వేలు మాత్రమే అందిస్తున్నారు. వీరికి న్యాయం చేయడంలో వర్సిటీ ఉన్నతాధికారవర్గాలు ఆసక్తిచూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వర్సిటీలో ఏడాదికాలంగా అకడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదన్న ఆరోపణలు ఉండగా ఆదివారం జరిగే ఈసీలో మాత్రం అకడమిక్ కౌన్సిల్ అప్రూవల్ లేకుండానే పలు కీలక నిర్ణయాల ఆమోదం కోసం సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో ఇంటర్మీడియట్ స్థాయిలో అఖిలభారత శిక్షాశాస్త్ర పరీక్ష(కామన్ ఎంట్రన్స్ టెస్ట్)ని నిర్వహించి, సర్టిఫికెట్లు అందించాలని నిర్ణయించారు. దీనికి కౌన్సిల్‌లో అప్రూవల్ తీసుకోకుండా, విధివిధానాలు రూపొందించకుండా ఈసీ ఆమోదానికి పెట్టనున్నట్లు తెలిసింది. వర్సిటీలోని గురుకుల పాఠశాల విస్తరణకు కౌన్సిల్ అప్రూవల్ లేకుండా అజెండా సిద్ధం చేశారు. ఈ పాఠశాలలో ఆరుసంవత్సరాల నుంచి విద్యార్థులకు అడ్మిషన్లు చేపట్టలేదు. దీనికితోడు ఇక్కడ రిక్రూట్ చేసిన ఇద్దరు టీచర్లకు ఇప్పటివరకు సర్వీస్ రూల్స్ పుట్ అప్ చేయకపోవడం గమనార్హం. ఇటీవల టీటీడీ చైర్మన్ గొప్పగా టీటీడీలో పనిచేసే ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇవ్వగా దాని పరిధిలోనే ఉన్న వేదవర్సిటీ, స్విమ్స్ ఉద్యోగులను మాత్రం విస్మరించారన్న విమర్శలు వినిపిస్తుండడం గమనార్హం.

ఇళ్ల స్థలాలు చూపాలని ధర్నా



సచివాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 24 : మంగళం ఉమ్మడి పంచాయతీ ప్రజలకు ఇంటిస్థలాలు చూపాలని సీపీఎం నేతలు వేణుగోపాల్, మాధవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రణధీరపురం(బీటీఆర్‌కాలనీ) సచివాలయం వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ 2021లో మంగళం ఉమ్మడి పంచాయతీలో 2,736మంది అర్హులైన వారికి జగనన్న ఇంటి పట్టాలు అందించారని, అయితే ఇప్పటివరకు స్థలాలను చూపలేదని అన్నారు. పాలకులు చెప్పిన విధంగా స్థానికంగానే ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలకు, స్థానికంగా ఉన్న కొంతమంది వైసీపీ నేతలకు మాటల యుద్ధం కొనసాగింది. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు పులిచెర్ల బుజ్జి, రాధాకృష్ణ, నిమ్మనపల్లి మునిరత్నం, మోదిన్, బాదుల్లా, హమీద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయండి



కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: స్మార్ట్‌సిటీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్, తిరుపతి స్మార్ట్ సిటీ బోర్డు చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం తిరుపతి స్మార్ట్‌సిటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ 33వ సమావేశం మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్సు హాల్లో నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని మాట్లాడుతూ పురోగతిలో ఉన్న 25 పనులు, శ్రీనివాససేతు పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆదేశించారు. పనుల వివరాలను సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మలికా గర్గ్, తుడా వీసీ వెంకటనారాయణ, ఏపీయూఎఫ్ఐడీసీ ఎండీ హరిత, అధికారులు రవిచంద్ర, రమాశ్రీ, రామచంద్రారెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచక్ర ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స





ఆపరేషన్ అనంతరం వృద్ధురాలిని నడిపిస్తున్న డాక్టర్ రాజేష్ - తొడలో విరిగిన ఎముక భాగం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 24 : తొడ ఎముక భాగం విరిగి పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న 73 ఏళ్ల వృద్ధురాలికి శ్రీచక్ర ఆస్పత్రిలో అరుదైన మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సతో నడిచేలా చేశామని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేటకు చెందిన వెంకటసుబ్బమ్మ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కొన్నేళ్ల కిందట మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకుందని, జరిగిన కొన్నాళ్లకే తొడలోని ఎముక కింది భాగం విరిగిపోయిందని పేర్కొన్నారు. అదే ఆస్పత్రిలో మళ్లీ విరిగిన ఎముక భాగానికి శస్త్ర చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో ఆరు నెలలుగా మంచానికే పరిమితమైందని వివరించారు. ఈ క్రమంలో ఆమె శ్రీచక్ర ఆస్పత్రికి రావడంతో అత్యాధునిక పరిజ్ఞానంతో అరుదైన మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సను అతి తక్కువ ఖర్చుతో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స జరిగిన మరుసటి రోజునే ఆమె మునుపటిలా నడిచినట్లు తెలిపారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



వ్రతమాచరిస్తున్న స్థానికులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 24: మాఘ మాస పౌర్ణమి, మఖానక్షత్రాన్ని పురస్కరించుకుని కొత్తవీధిలోని కన్యాకపరమేశ్వరి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణవ్రతం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అన్నవరం నుంచి వచ్చిన సత్యనారాయణస్వామి ఉత్సవర్లను ఆలయంలో వేంచేపు చేశారు. వేదికపై కొలువుదీర్చి అలంకరించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ సత్యనారాయణవ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. 500 మంది భక్తులు పాల్గొని వ్రతమాచరించారు. అన్నవరం నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక గవాంచ, రాగిమాడ, ప్రసాదాలను వితరణ చేశారు.



కోదండరామస్వామి ఆలయానికి కలశం తీసుకెళ్తున్న పురోహితులు, అశోక్‌రాజు

వైభవంగా కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం



ప్రత్యేకాలంకరణలో కోదండరామస్వామి

విజయపురం, ఫిబ్రవరి 24: విజయపురంలో శనివారం కోదండరామస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. సిద్ధార్థ గ్రూపు విద్యాసంస్థల చైర్మన్ కొండూరు అశోక్‌రాజు, ఇందిరవేణి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిల్పి మోహన్, శిష్య బృందంచే శ్రీరామ, లక్ష్మణ, హనుమంత, లక్ష్మీహైగ్రీవ విగ్రహాలను సిద్ధం చేసి అంకురార్పణ చేశారు. ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠ, కలశపూజ, పూర్ణాహుతి, హోమం, పూర్ణకుంభం, మహాసంప్రోక్షణ ప్రతిష్ఠ, అష్టబంధన, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది రాష్ట్రాల పురోహితులు, ఆలయ పురోహితుడు వందవాసి మహేశ్‌శర్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.


పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పేరు: నారా చంద్రబాబు నాయుడు

పుట్టినతేదీ: 20.4.1950
తల్లిదండ్రులు: అమ్మణ్ణమ్మ, ఖర్జూరనాయుడు
సతీమణి: నారా భువనేశ్వరి, **కుమారుడు:** నారా లోకేశ్
కోడలు: నారా బ్రాహ్మణి, **సొంతూరు:** నారావారిపల్లె, చంద్రగిరి
ఎమ్మెల్యేగా: 1978-83 చంద్రగిరి.. 1989 నుంచి ఏడుసార్లు కుప్పం నుంచి, మంత్రిగా: 1980-83 సినిమాటోగ్రఫీ శాఖ, 1994-95 ఆర్థిక, రెవెన్యూ శాఖ
సీఎంగా 14 ఏళ్లు: ఉమ్మడి రాష్ట్రంలో 1995- 2004, నవ్యాంధ్రలో 2014-19
ప్రతిపక్ష నాయకుడిగా 15 ఏళ్లు: 2004-14, 2019 నుంచి ఇప్పటివరకు.



పేరు: నూతన కాల్వ అమరనాథరెడ్డి

పుట్టిన తేది: 02.07.1959, **విద్యార్హత:** బీకాం
పదవులు: రెండుసార్లు సర్పంచి, ఓసారి డీసీసీబీ ఛైర్మన్
ఎమ్మెల్యేగా: పుంగనూరు నుంచి 1996-99, 2004-09... పలమనేరు నుంచి 2009-14, 2014-19
తండ్రి: రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే
తల్లి: తాయారమ్మ, మాజీ సర్పంచి
భార్య: రేణుకారెడ్డి
కుమారుడు: ప్రసేన్‌రెడ్డి
కోడలు: ప్రీతికారెడ్డి.



పేరు: గాలి భానుప్రకాష్

తండ్రి: గాలి ముద్దుకృష్ణమ నాయుడు, మాజీ మంత్రి
తల్లి: సరస్వతమ్మ, మాజీ ఎమ్మెల్సీ
కుటుంబం: భార్య శిరీష, ఇద్దరు కుమారులు, **పుట్టిన తేది:** 20.06.1976
విద్యార్హత: అమెరికాలోని బ్రిడ్జ్‌పోర్ట్ వర్సిటీలో ఎంఎస్
కుటుంబ నేపథ్యం: తండ్రి పుత్తూరు నియోజకవర్గం నుంచి ఐదుసార్లు, నగరి నుంచి ఓసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో విద్య, అటవీశాఖ మంత్రిగా పనిచేశారు.ఎమ్మెల్సీగా ఉంటూ మృతిచెందాక ఆయన భార్యకు ఎమ్మెల్సీ అవకాశం లభించింది.
పోటీ: 2019 ఎన్నికల్లో పోటీ చేసి 2818 ఓట్ల తేడాతో ఓడిపోయారు.



పేరు: వదింగాడు మునస్వామి (వీఎం) థామస్

పుట్టిన తేది: 28.06.1974
తల్లిదండ్రులు: రాణి, ప్రకాశం
భార్య: అనార్కళి రెడ్డి
పిల్లలు: రాహుల్, రోషన్
విద్యార్హతలు: పీహెచ్‌డీ ఇన్ బయోటెక్నాలజీ
వృత్తి: ఐవీఎఫ్ సైంటిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్టు.



పేరు: గురజాల జగన్మోహన్

పుట్టినతేదీ: 15.01.1983
తల్లిదండ్రులు: రజని, చెన్నకేశవులు నాయుడు
స్వగ్రామం: కోలావూరు, గుడిపాల మండలం
భార్య: ప్రతిమ
కుమారుడు : నితీష్ చౌదరి
సేవ: జీజేఎం ట్రస్టు పేరిట సేవా కార్యక్రమాలు చేస్తుంటారు.



ఐదు చోట్ల టీడీపీ అభ్యర్థులు
ఖరారు

- కుప్పం, పలమనేరు, జీడీనెల్లూరు, నగరిలో ఇప్పటికే ప్రకటన
- చిత్తూరుకు కొత్త అభ్యర్థి గురజాల జగన్మోహన్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ జోరు పెంచింది. చిత్తూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒకేసారి ఐదు చోట్ల ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేయడంతో సందడి ఊపందుకుంది. పూతలపట్టు, పుంగనూరు మినహా అభ్యర్థులు ఖరారయ్యారు. కుప్పం చంద్రబాబు, పలమనేరు అమరనాథరెడ్డి, జీడీనెల్లూరు డాక్టర్ థామస్, నగరి గాలి భానుప్రకాష్ విషయాల్లో ఇదివరకే స్పష్టత ఉండగా, చిత్తూరు అసెంబ్లీ స్థానానికి కొత్త అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను ప్రకటించారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గురజాల జగన్మోహన్



చిత్తూరులో టీడీపీ శ్రేణుల ర్యాలీ

పూతలపట్టు, పుంగనూరు సందిగ్ధం

చంద్రబాబు శనివారం ప్రకటించిన జాబితాలో పూతలపట్టు, పుంగనూరు అభ్యర్థులు లేరు. దీంతో ఆ రెండు చోట్ల సందిగ్ధత నెలకొంది. పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మురళీమోహన్‌ను గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పూతలపట్టులో భారీ బహిరంగ సభ కూడా నిర్వహించారు. ఇన్‌ఛార్జిగా ప్రకటించినప్పటి నుంచి మురళి కూడా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన విషయంలో మార్పులు ఉండకపోవచ్చని పార్టీ పెద్దలు అంటున్నారు. ఓ వైపు జనసేన, మరోవైపు బీజేపీ పొత్తు కారణంగా టీడీపీ అధిష్ఠానం అక్కడక్కడా కొన్ని సీట్లను ప్రకటించలేదు. ఈ క్రమంలోనే పుంగనూరు అభ్యర్థిని ప్రకటించకుండా వాయిదా వేసిందా అనే చర్చలు స్థానికంగా నడుస్తున్నాయి. ఇక పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మంత్రి పెద్దిరెడ్డితో నిత్యం పోరాడుతున్నారు. ఆయన పేరు ఎందుకు ప్రకటించలేదా అనే చర్చ కూడా నడుస్తోంది.

గురజాలకే అని ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

కీలకమైన జిల్లా కేంద్రం చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాలకు చిత్తూరు టికెట్ వస్తుందని ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది. 'గురజాల జగన్మోహన్‌కు మెరుగైన అవకాశాలు' శీర్షికతో జనవరి 29న ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో కథనాన్ని ప్రచురించింది. 2019 ఎన్నికల తర్వాత ఏఎస్ మనోహర్ బయటికి వెళ్లిపోయినప్పటి నుంచి ఇక్కడ టీడీపీ ఇన్‌ఛార్జి పోస్టు ఖాళీగా ఉంది. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ వచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చిత్తూరు టికెట్ కోసం విపరీతమైన పోటీ పెరిగింది. సీకే బాబు దంపతులు సహా డీకే కుటుంబం, కటారి హేమలత, చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్.. ఇలా చాలామంది తెరపైకి వచ్చారు. బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఆరు నెలల కిందట వచ్చిన గుడిపాలకు చెందిన గురజాల జగన్మోహన్ చిత్తూరు టీడీపీలో ఊపు తీసుకొచ్చారు. విద్య, వైద్య అవసరాల కోసం వచ్చినవారికి ఆర్థిక సాయంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు చేస్తూ తక్కువ సమయంలోనే వెలుగులోకి వచ్చారు. పోటీ మరీ ఎక్కువ కావడంతో దొరబాబు ఆరుగురు ఆశావహులతో బృందాన్ని ఏర్పాటుచేసి ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ చేసిన ఐవీఆర్ఎస్ సహా అన్నిరకాల సర్వేలో గురజాల జగన్ పేరు రావడంతో అతడి పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత అభిమానులు, టీడీపీ కార్యకర్తలు శనివారం మురకంబట్టు సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకు భారీఎత్తున ర్యాలీ చేశారు.

లక్ష మెజార్టీ లక్ష్యంతో

టీడీపీ అధినేత చంద్రబాబు 8వసారి కుప్పం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు. 1989 నుంచి వరుసగా పోటీ చేసి గెలుస్తున్న విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో మెజార్టీ తగ్గడంతో ఈసారి ఇక్కడ లక్ష మెజార్టీ లక్ష్యంగా టీడీపీ నాయకులు, శ్రేణులు పనిచేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అక్రమ ఏకగ్రీవాలు చేసుకోవడం, యాక్టివ్‌గా ఉండే టీడీపీ శ్రేణుల మీద తప్పుడు కేసులు వేధించడంతో నియోజకవర్గంలోని శ్రేణుల్లో కసి పెరిగింది. ఈసారి కచ్చితంగా తమ నాయకుడికి లక్ష మెజార్టీతో గెలిపించి బహుమతిగా ఇవ్వాలనే తలంపుతో పనిచేస్తున్నారు.

రాజకీయాలకు కొత్తయినా దూసుకుపోతూ..

జీడీనెల్లూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఇప్పటికే ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ థామస్‌ను ప్రకటించారు. వృత్తి రీత్యా ఫెర్టిలిటీ విభాగ వైద్యుడైన థామస్.. చంద్రబాబు పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చారు. ఈయన సొంతూరు కార్వేటినగరంలోని అల్లాగుంట గ్రామం కావడం, నియోజకవర్గంలో పిల్లలు లేని జంటలకు ఈయన ఫెర్టిలిటీ సెంటర్‌లో సంతాన భాగ్యం కలిగించడం వంటి కారణాలతో ఇక్కడి నాయకులకు, ప్రజలకు త్వరగా చేరువయ్యారు. థామస్‌ను గతేడాది జూన్ 1వ తేదీన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అధిష్ఠానం ప్రకటించడంతో అప్పటి నుంచి ఆయన విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే నారాయణస్వామి దళితుల ఆత్మగౌరవాన్ని రెడ్ల వద్ద తాకట్టు పెట్టాడనే నినాదంతో ముందుకు వెళుతున్నారు. దీంతో పాటు వైసీపీ అధిష్ఠానం ఇక్కడ ఓసారి రెడ్డెప్ప అని, మరోసారి నారాయణస్వామి అని ప్రకటించింది. ఇప్పుడు పద్మజ అనే కొత్త పేరు ప్రచారంలో ఉంది. దీంతో వైసీపీ దళిత అభ్యర్థుల్ని అవమానిస్తోందని నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారు.

తండ్రిలా అందరికీ అందుబాటులో ఉంటూ..

నగరిలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడి పెద్ద కుమారుడు గాలి భానుప్రకాష్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. తన తండ్రి హయాంలోనే నియోజకవర్గంలోని శ్రేణులకు సన్నిహితంగా మెలిగారు. 2019లో అశోక్ రాజు, గాలి జగదీష్‌తో హోరాహోరీ పోటీ ఉన్నప్పటికీ అధిష్ఠానం చివరి దశలో గాలి భానుప్రకాష్‌ను ప్రకటించింది. 2800 స్వల్ప ఓట్ల తేడాతో రోజా చేతిలో ఓటమి చెందారు. అప్పటి నుంచి నియోజకవర్గంలోని శ్రేణులకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. తండ్రి తరహాలోనే నిరుపేదల ఇళ్లల్లో జరిగే కార్యక్రమానికీ హాజరై.. అన్ని వర్గాల నుంచీ ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు. గత ఎన్నికల్లో త్రుటిలో తప్పిన విజయాన్ని ఈసారి మంచి మెజార్టీతో సాధించాలని శ్రేణులు ఈయన కోసం గట్టిగా పనిచేస్తున్నారు.

ఇప్పటికే 'ఇంటింటికి టీడీపీ' పూర్తి

కుప్పం తరహాలోనే పలమనేరు అభ్యర్థి విషయంలోనూ ముందు నుంచీ క్లారిటీ ఉంది. ఇప్పుడు అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. 2019 ఎన్నికల్లో అమరనాథరెడ్డి ఓడిపోయినా, ఈసారి నాలుగు నెలలు ముందు నుంచే ఇంటింటికి టీడీపీ పేరుతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లారు. ప్రతి మండలంలోనూ ఆయన ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు వలస వచ్చారు. ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు కూడా 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పనిచేస్తున్నారు. ఈయన జిల్లా టీడీపీకి పెద్దదిక్కుగా ఉంటూ, అభ్యర్థుల కసరత్తు విషయంలో రాయలసీమ కోఆర్డినేటర్‌గానూ వ్యవహరించారు. గతేడాది నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి జిల్లా దాటేవరకు లోకేశ్‌కు తోడుగా నడిచారు.

రాజీకి లోబడే క్రిమినల్ కేసులను పరిష్కరించండి



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24: రాజీకి వీలయ్యే క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు పోలీసు అధికారులు చొరవ తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర సూచించారు. శనివారం న్యాయస్థానం ఆవరణలో పుత్తూరు న్యాయస్థానం పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 9వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌లో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధి నుంచి రాజీకి అవకాశం ఉండే క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వై.శ్రీనివాసరావు, సీఐలు ఓబులేశు, భాస్కర్‌నాయక్, ఎస్ఐలు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపిస్తే రాష్ట్రానికి భవిష్యత్తు



ఆదిఆంధ్రవాడలో భానుప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

వడమాలపేట, ఫిబ్రవరి 24: సంపదను సృష్టించి నవ సమాజాన్ని ప్రజలకు అందించడమే ధ్యేయంగా పనిచేసే చంద్రబాబును గెలిపిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని నగరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ చెప్పారు. శనివారం వడమాలపేట పంచాయతీ పరిధిలోని రామసముద్రం, ఆది ఆంధ్రవాడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. ప్రజలు డప్పు వాయిద్యాలు, మంగల హారుతులతో స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే తండ్రిబాటలో పయనిస్తూ వడమాలపేట మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని భానుప్రకాష్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానా వెంకటయ్య, జిల్లా అధికార ప్రతినిధులు చినబాబు, ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, హేమావతి, శివరాయల్, గురునాథం శెట్టి, ఉమాపతి రావ్, పెద్దబ్బరాజు, శేషాద్రి యాదవ్, లోకరాజు, దేవ, గోపీనాథ్, జనసేన నాయకులు మునిశేఖర్, చక్రి, శేషు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.03 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.03 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది.

ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం కుమారధార తీర్థ ముక్కోటి ఘనంగా నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయానికి వాయవ్యదిశలో వెలసి ఉన్న కుమారధార తీర్థ ముక్కోటికి భక్తులు భారీగా తరలివచ్చారు. మాఘ మాసంలో పౌర్ణమి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులను శనివారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీర్థానికి అనుమతించారు. భక్తిశ్రద్ధలతో గోవిందనామస్మరణ చేసుకుంటూ తీర్థానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ వెలసి ఉన్న కుమారస్వామిని దర్శించుకుని హారతులు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్న ప్రసాదాలు, తాగునీరు ఏర్పాటు చేసింది. పటిష్టమైన భద్రత కల్పించారు.

పుత్తూరు వార్తలు

అభివృద్ధి పనులు ప్రారంభం



సచివాలయ భవనం వద్ద మంత్రి రోజా

వడమాలపేట, ఫిబ్రవరి 24: మండలంలోని పేడి పంచాయతీలో కోటి రూపాయల వ్యయం చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి రోజా ప్రారంభించారు. నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ భవనాలను శనివారం ప్రారంభించారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, ఫిబ్రవరి 24: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు.

నగరిలో భానోదయం తథ్యం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24: రానున్న ఎన్నికల్లో నగరి అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ గెలుపు తథ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య స్పష్టం చేశారు. శనివారం నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా భానుప్రకాష్ అభ్యర్థిత్వం ఖరారు చేస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు నగరి నియోజకవర్గం నుంచి వైసీపీని గెలిపించినందుకు నియోజక వర్గ ప్రజలు పశ్చాత్తాపం పడుతున్నట్లు చెప్పారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో కక్షసాధింపులు, వేధింపులు, అవినీతి, దౌర్జన్యాలతో నియోజకవర్గ ప్రజలు విసిగివేశారి పోయారని ధ్వజమెత్తారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల కృషితో నగరి నుంచి గాలి భానుప్రకాష్ అఖండ మెజార్టీతో గెలవనున్నారని తేల్చి చెప్పారు. అనంతరం తిరుపతిలో గాలి భానుప్రకాష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవనాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, డీఎస్ గణేష్, కరుణాయాదవ్, డీజీ ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.



భానుప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న నేతలు

ప్రతి అభివృద్ధిలోనూ మోదీ ముద్ర



క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో అమలయ్యే ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారం, ప్రధాని నరేంద్రమోదీ ముద్ర స్పష్టంగా ఉన్నాయని నగరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కేఏన్ హరిబాబు చెప్పారు. శనివారం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తొరూరు, గొల్లపల్లి, అడవికండ్రిగ, రామసముద్రం గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి మురళీనాయుడు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉచిత రేషన్ బియ్యం, అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మిస్తున్న గృహాలకు నిధులు అందించేది కేంద్ర ప్రభుత్వమేనని తెలిపారు. సామాజిక భద్రతా పించన్లు, రైతు భరోసా, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆయుష్మాన్ భారత్ కింద ఏడాదికి రూ.5 లక్షల ఉచిత వైద్యం తదితర పథకాలన్నీ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్నవేనని గ్రామీణులకు వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే క్యాలెండర్లను పంపిణీ చేశారు.

ధర్నాను విజయవంతం చేయండి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 24: తిరుపతి కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న తేదీన చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబు, జిల్లా సమితి సభ్యుడు మహేష్ పిలుపునిచ్చారు. శనివారం ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నిధులు వారికే వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో చెంగయ్య, శరవణ, చంద్రశేఖర్, శీను, శివ, దేశయ్య, కైలాసం, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వైభవంగా కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం



ఆలయానికి కలశం తీసుకెళ్తున్న పురోహితులు, అశోక్‌రాజు

విజయపురం, ఫిబ్రవరి 24: విజయపురంలో శనివారం కోదండరామస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. సిద్ధార్థ గ్రూపు విద్యాసంస్థల ఛైర్మన్ కొండూరు అశోక్‌రాజు, ఇందిరవేణి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిల్పి మోహన్, శిష్య బృందంచే శ్రీరామ, లక్ష్మణ, హనుమంత, లక్ష్మీహైగ్రీవ విగ్రహాలను సిద్ధం చేసి అంకురార్పణ చేశారు. ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠ, కలశపూజ, పూర్ణాహుతి, హోమం, పూర్ణకుంభం, మహాసంప్రోక్షణ ప్రతిష్ఠ, అష్టబంధన, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది రాష్ట్రాల పురోహితులు, ఆలయ పురోహితుడు వందవాసి మహేశ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో కోదండరామస్వామి

తిరువణ్ణామలైకు తగ్గిన ప్రయాణికులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 24: తమిళనాడు తిరువణ్ణామలైకు ప్రయాణికుల సంఖ్య తగ్గినట్లు ఆర్టీసీ గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి నెలా పౌర్ణమి రోజున తిరువణ్ణామలై గిరిప్రదక్షిణ చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వెళుతుంటారు. దానికి తగినట్లు ఆర్టీసీ యంత్రాంగం బస్సులను నడుపుతుంది. ప్రతినెలా 150 బస్సులను కేటాయిస్తుండగా గడిచిన రెండు పర్యాయాలు రద్దీ తగ్గింది. గతనెల 90బస్సులు వెళ్లాయి. ఈ నెలకు గాను శుక్ర, శనివారాల్లో 150 బస్సులు కేటాయించగా 114 వెళ్లాయి. రద్దీ లేని కారణంగా అధికారులు కొన్ని బస్సులను రద్దు చేశారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి24: రాష్ట్రంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే ఏపీపాలిసెట్-2కే24కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి కోరారు. ఈనెల 20 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభమైందని, ఏప్రిల్ 4వ తేదీతో గడువు ముగుస్తుందని వివరించారు. ఏప్రిల్ 27న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌బీటీఈటీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ని సందర్శించాలని కోరారు.

గ్రూపు-2 పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్ 2 పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వర్చువల్ విధానంలో పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రీసర్వే, గృహనిర్మాణశాఖ, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపైనా సమీక్షించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసప్రసాద్, ఆనందమూర్తి, జయరాజ్, విజయకుమార్, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాసుదేవరావు

కేవీబీపురం ఫిబ్రవరి24: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్య క్షుడిగా మండలానికి చెందిన కాళంగి గ్రామానికి చెందిన వాసుదేవరావు మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రకటించారు.

టీడీపీతోనే భవిత : సుధీర్‌రెడ్డి



రేణిగుంట, ఫిబ్రవరి 24: టీడీపీతోనే యువతకు ఉపాధి లభిస్తుందని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్ బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. రేణిగుంటలో శనివారం వంద మంది యువకులతో బి.బాబు పార్టీలో చేరారు. వీరికి సుధీర్‌రెడ్డి పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు చెక్‌పోస్టు కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంచయ్య నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు టి.మునిచంద్రారెడ్డి, పి.మునస్వామి నాయుడు డి.పుష్పనాథ్, పి.చిన్నారెడ్డి, వెంకట ముని రెడ్డి, ముళ్లపూడి ఉమామహేశ్వర రావు, రాజ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు.

కాసరంలో టీడీపీ ప్రచారం

తొట్టంబేడు, ఫిబ్రవరి 24: టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి మండలంలోని కాసరం పంచాయతీలో 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీడీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాలి మురళినాయుడు, మునిరాజనాయుడు, జడ్పీటీసీలు వెంకటసుబ్బారెడ్డి, తిరుమలయ్య, నాయకులు వెంకటాచలం, భాస్కర్ నాయుడు, దివ్య, చెంచయ్య, మాధవయ్య, రత్నం, గిరి, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

తొట్టంబేడు, ఫిబ్రవరి 24: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి మండలంలోని వలంటీర్లను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో పఠాన్‌రఫీఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సేవావజ్ర అవార్డుకు ఇద్దరు, సేవరత్నకు ఐదుగురు, సేవామిత్రకు 275మంది వలంటీర్లు ఎంపికయ్యారు. వారిని స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మిద్దెలహరి, ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి, నాయకులు వయ్యాల క్రిష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి పూజలు

తొట్టంబేడు, ఫిబ్రవరి 24: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని అన్నపూర్ణాసమేత నీలకంఠేశ్వరస్వామి వారికి మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు అలంక రణలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సిపాయి భరోసా పంపిణీ



రేణిగుంట, ఫిబ్రవరి24: నియోజకవర్గంలో పేద కుటుంబాల్లో యజమానులు మృతి చెందితే ఆ కుటుంబాన్ని సిపాయి భరోసా ద్వారా ఆదుకుంటామని సిపాయి ఫౌండేషన్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. రేణిగుంట పంచాయితీలోని జ్యోతి నగర్‌లో ఇటీవల గంగాబాయ్, ఉదయ్‌కుమార్‌లు మృతి చెందారు. ఆ కుటుంబాలకు శనివారం 40 రకాల నిత్యవసరాల సరుకుల కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుజాత, పంచాయితీ వార్డు సభ్యులు పఠాన్ ఖాదర్‌వల్లీ ఖాన్, ఇన్నయ్యనాథం, గంగమ్మగుడి చైర్మన్ ఎస్.మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు తగ్గించాలి

కేవీబీపురం, ఫిబ్రవరి24: మాతా, శిశు మరణాలను తగ్గించడమే ధ్యేయమని జిల్లా టాస్క్‌ఫోర్స్ శ్రీనివాసరావు తెలియజేశారు. శనివారం కోటమంగాపురంలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వాణి ప్రమీల, వైద్య సిబ్బంది రవి, చంద్రరాజు, వెంకటమ్మ, కృష్ణయ్య, శివకుమార్, అనిత, సాయిపద్మ, శ్యామల, లక్ష్మీ, రేవతి పాల్గొన్నారు.

మిద్దెల హరికి సన్మానం

ఏర్పేడు, ఫిబ్రవరి 24: ఆర్టీసీ వైస్‌చైర్మన్‌గా నియమితులైన మిద్దెల హరిని ఏర్పేడు మండల వైసీపీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. గుడిమల్లం పరశురా మేశ్వరస్వామిని తీర్థప్రసాదాలను అందజేశారు. వైసీపీ నాయకులు అర్జున్‌బాబు, కొత్తకాల్వ మోహన్‌రెడ్డి, దొరై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ మెడికల్ కిట్ల వితరణ

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 24: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు హైదరాబాద్‌కు చెందిన నిజాం ఫిజియోథెరపీ వారు రెండు ఫిజియోథెరపీ కిట్లను పంపిణీ చేశారు. వీటిపై ఎంఈవోలు రవీంద్ర నాథ్, మునిసుబ్రమణ్యం శనివారం హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరమైన వారు కిట్లను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ జ్ఞానశేఖర్ సేవలు అందిస్తారన్నారు. రిసోర్సుపర్సన్ అయ్యప్పరెడ్డి, పీజీ నయోమి, ఫిజియోథెరపిస్టు జ్ఞానశేఖర్, హెచ్‌ఎం రమణయ్య పాల్గొన్నారు.

మారియమ్మకు ప్రత్యేక పూజలు

కేవీబీపురం, ఫిబ్రవరి24: మండల కేంద్రంలో కొలువైన ఉన్న ముత్తు మారి యమ్మకు మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ గురుస్వామి నారాయణ తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని వరదయ్య పాళెం పంచాయతీ గోవర్ధనపురంలోని ఏకం కార్యాలయ ప్రాంగణంలో శనివారం సత్యనారాయణస్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు సత్య నారాయణస్వామి వ్రతాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

చిత్రపటాల వితరణ



మండపంలో ఏర్పాటు చేసిన చిత్రపటాలను పరిశీలిస్తున్న ఈవో, చైర్మన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఆశీర్వాద మండపానికి తిరుపతికి చెందిన లావణ్య పిక్చర్స్ అండ్ ఫ్రేమ్స్ నిర్వాహకులు శంకర్‌నాయుడు చిత్రపటాలను వితరణ చేశారు. జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి, భక్త కన్నప్ప, ముక్తిని పొందిన శ్రీకాళహస్తికి ప్రతిరూపమైన మూడు మూగజీవుల చిత్రపటాలను శనివారం ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు చిత్రపటాలను ఆలయంలోని అలంకార మండపంలో భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాటు చేశారు. చిత్రపటాల విలువ రూ.3.75 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. దాతను శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సమాచారం ఇవ్వకపోవడం తగదు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 24: అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ప్రజాప్రతినిధులకు ఇవ్వకపోవడం తగదని సింగిల్ విండో చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మంది రంలో శనివారం వైస్ ఎంపీపీ విజయమ్మ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. వైద్యాధికారి హమీద్ మాట్లాడు తుండగా హరిశ్చంద్రారెడ్డి కల్పించుకున్నారు. రామగిరిలో ఇటీవల జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ రేఖకు, ఆ గ్రామ సర్పంచ్ సతీష్‌లను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. జగనన్న రెండవ దశ ఇంటి పట్టాల పంపిణీ ఎంపీపీకి తెలియకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని రాజానగరం సర్పంచ్ భూపతి నాయుడు హౌసింగ్ ఇంజనీర్‌ను కోరారు. జడ్పీటీసీ గైర్హాజరయ్యారు. 9 మంది ఎంపీటీసీలకు గాను ముగ్గురు, 21 మంది సర్పంచ్‌లకు గాను ఐదుగురు మాత్రమే హాజరయ్యారు.

మేమింతే..రోడ్లు బాగున్నా తవ్వేస్తాం

- యథేచ్ఛగా ముక్కంటి సంపద లూటీ
- రాత్రికి రాత్రి రోడ్డు ఛిద్రం
- కాసుల కోసం కక్కుర్తి పనులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: ముక్కంటి సంపదను లూటీ చేయడమే ధ్యేయంగా బరితెగించేస్తున్నారు. అవసరం లేని పనులను సైతం ప్రతిపాదన చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నారు. ధనార్జనే తమ ధ్యేయం అన్నట్టుగా పాలకులు, అధికారులు కలిసి దేవుడి సంపదను స్వాహా చేస్తున్నారు. చిన్నపాటి కంకర ముక్క కూడా లేవని రోడ్డును రాత్రికి రాత్రి ఛిద్రం చేసే పనులకు శ్రీకారం చుట్టడమే ఇందుకు నిదర్శనం. ఈ తంతు శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని సన్నిధివీధిలో శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణంలోని రామసేతు వంతెన వద్ద నుంచి ముక్కంటి ఆలయం వరకు మాస్టర్ ప్లాన్ కోసం కోట్ల రూపాయలు వెచ్చించి స్థలం సేకరించారు. రామసేతు వంతెన వద్ద నుంచి రామ మందిరం వరకు ఉన్న రోడ్డు కూడా మాస్టర్ ప్లాన్ పరిధిలో ఉంది. ఆరు నెలల క్రితం ఈ రోడ్డులో ముక్కంటి ఆలయ సొమ్ము రూ.40 లక్షలతో మురుగు కాలువలు నిర్మించారు. ఇక మాస్టర్ ప్లాన్ కాకుండా పట్టణ శివారు పూతలపటు -నాయుడుపేట బైపాస్ వంతెన నుంచి ముక్కంటి ఆలయం వరకు శివ టు శివ రోడ్డు ప్రతిపాదనలో ఉంది. ఇటీవలే శివ టు శివకు రూ.27 కోట్లతో టెండర్ కూడా ఖరారు చేశారు. ఇప్పుడు తవ్వేస్తున్న సన్నిధి వీధిలోని రోడ్డు కూడా అందులో భాగమే. మాస్టర్ ప్లాన్ పరంగా గాని... ఇటు శివ టు శివ రోడ్డు నిర్మాణంలో కానీ ఈ సన్నిధి వీధి రోడ్డుకు మహర్దశ లభించడం ఖాయం. అయినా ఇప్పుడు ఆగమేఘాలపై ఎందుకు తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేయాల్సి వచ్చిందో ఆ దేవుడికే ఎరుక. కేవలం కాసుల కోసం ఇలాంటి అనవసరమైన పనులు సాగిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.



శుక్రవారం తవ్వకముందు బాగున్న రోడ్డు



తవ్వేసిన తరువాత ఇలా

శ్రీసిటీలో త్యాగరాజు ఆరాధనోత్సవం

శ్రీసిటీ, ఫిబ్రవరి 24: ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజును స్మరించుకుంటూ శ్రీసిటీలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం చేపట్టిన త్యాగరాజు ఆరాధనోత్సవం వీనుల విందుగా సాగింది. మాఘ పూర్ణిమ శుభ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంగీత కచేరి ప్రారంభమైంది. శ్రీసిటీ శ్రీవాణి, సూళ్లూరుపేట ఎంజీఆర్ మ్యూజిక్ స్కూలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మ్యూజిక్ స్కూలుకు చెందిన సంగీత విద్వాంసులు, విద్యార్థులు పాల్గొన్నారు. పంచరత్న కీర్తనల బృంద గానం సంగీత ప్రియులను మంత్ర ముగ్ధులను చేసింది. సంగీత విద్వాంసులు ఝాన్సీ, రాజ్యలక్ష్మి, డాక్టర్ కృష్ణకుమార్, లోకేష్, హరిప్రసాద్, ఇతర బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. శ్రీసిటీ ఉద్యోగులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున ఆరాధానోత్సవానికి హాజరై త్యాగరాజ కీర్తలను ఆస్వాదించారు. సంగీత విద్వాంసులందరికి నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

జయహో బీసీ సభను జయప్రదం చేద్దాం

ఏర్పేడు, ఫిబ్రవరి 24: తిరుపతి పార్లమెంటు పరిధిలో ఈ నెల 27న జరిగే జయహో బీసీ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవా రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో ఆయన నియోజకవర్గస్థాయి బీసీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కామేష్‌యాదవ్, దొరైరాజ్‌రెడ్డి, ఎమ్ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ విజయం కోసం పనిచేస్తాం

తొట్టంబేడు, ఫిబ్రవరి 24: టీడీపీ విజయం కోసం పని చేస్తామని ఎస్సీ సెల్ నాయకులు తెలియజేశారు. ఊరందూరు గ్రామంలో బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృ హంలో శనివారం శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండ లాలకు చెందిన ఎస్సీ సెల్ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

కబ్జాదారులపై కఠిన చర్యలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే శ్రీకాళహస్తిలో కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత అన్నారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్ నగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను శనివారం జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, కాలువ పోరంబోకు, నిరుపేదల స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని విమర్శించారు.

ప్రత్యేకాధికారి తనిఖీలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా తిరుపతి ఆర్‌జేసీ సత్య నారాయణమూర్తిని దేవదాయశాఖ అధికారులు నియమించారు. ఈ మేరకు ఆయన శనివారం ఆలయానికి విచ్చేశారు. ఆలయంలోని సీసీ కెమెరా నిఘా వ్యవస్థ, నిత్యాన్నదానం, పోటు విభాగాలను తనిఖీ చేశారు. ఉత్సవాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఆయా విభాగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సిబ్బందికి సూచనలు చేశారు.

నైపుణ్యంతోనే అభివృద్ధి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: నైపుణ్యంతోనే జీవితంలో అభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. పట్టణంలోని కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థికి నైపుణ్యం ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి సంస్థ ప్రతినిధి సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మురళి, అధ్యాపకులు రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్త ఆత్మహత్య



నాగరాజుయాదవ్ (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, ఫిబ్రవరి 24: ఏర్పేడు మండలం సీతారాంపేట సర్పంచ్ నిర్మల భర్త నాగరాజు యాదవ్ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీతా రాంపేట గ్రామానికి చెందిన నాగరాజు శ్రీకాళహస్తి మండలం వెల్లం పాడు వద్దనున్న సోమాని టైల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఉద్యోగి. వైసీపీలో చురుకైన నాయ కుడు. కొద్దిరోజులుగా ఇంట్లో కుటుంబ కల హాలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఆయన భార్య నిర్మల తిరువణ్ణామలై వెళ్లింది. ఈ సమయంలో సీతారాంపేట వద్దనున్న రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకున్నాడు. బొజ్జల సుధీర్‌రెడ్డి ఆయన మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

బీజేపీని ఆదరించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆపార్టీ నాయకులు కోరారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఐదో వార్డు పరిధిలోని కుమ్మర వీధిలో శనివారం ఇంటింటికీ ప్రచారం చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న కోలా ఆనంద్‌ను గెలిపించి అభివృద్ధికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిపాటి రమేష్ బాబు, అమర్నాథ్, వాసు యాదవ్, డిల్లీ కుమార్ పాల్గొన్నారు.

గాలి భానుప్రకాష్‌కి శుభాకాంక్షలు



తొట్టంబేడు, ఫిబ్రవరి 24: టీడీపీ నగిరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ దక్కడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి పార్లమెంట్ సెక్రటరీ తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కోలాహలంగా వార్షికోత్సవం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 24: వరదయ్యపాళెం మండలంలోని గోవర్ధనపురంలో గల నైస్ విద్యాసంస్థ 14వ వార్షికోత్సవాలు కోలాహలంగా నిర్వహించారు. జబర్దస్త్ కామెడీ షో అలరించింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపోల్ టైర్స్ ఉద్యోగిపై దోపిడీ ముఠా దాడి

- బైక్, నగదు, మొబైల్ అపహరణ



గాయపడ్డ చంద్రశేఖర్

సత్యవేడు, ఫిబ్రవరి 24: పనికి వెళుతున్న ఉద్యోగిపై గుర్తు తెలియని దుండగులు దారిలో అడ్డగించి, కత్తితో దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు. అతడి నుంచి నగదు, బైక్, మొబైల్ దోపిడీ చేశారు. బాధితుడి కథనం మేరకు... నాగలాపురం మండలం రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరులోని అపోలో టైర్స్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి నైట్ షిఫ్ట వెళ్లేందుకు 10 గంటల సమయంలో తన ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో సత్యవేడు మండలం రంగనాథపురం సమీపంలోని తెలుగు గంగ కాలువ వద్ద గుర్తుతెలియని దుండగులు అతడి బైక్‌ను అడ్డగించారు. కత్తులతో దాడి చేశారు. అతని ద్విచక్ర వాహనం, రూ.1500 నగదు, మొబైల్ ఫోన్‌తో ఉడాయించారు. చంద్రశేఖర్ వీపు పైన, చేతిపైన గాయాలయ్యాయి. తర్వాత అతడు సత్యవేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈఘటనలో శ్రీసిటీలోని పరిశ్రమలకు ద్విచక్ర వాహనాలపై వెళ్లే కార్మికులు భయాందోళన గురవుతున్నారు. ఈ మార్గంలో రాత్రి వేళ పోలీసుల గస్తీ చేపట్టాలని కోరుతున్నారు.

శ్రీసిటీలో జీటో ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, ఫిబ్రవరి 24: చెన్నైలోని జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జేటీవో)కు చెందిన వంద మంది సభ్యుల యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రతినిధి బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. సంస్థ కన్వీనర్ నమన్ మునోత్ నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ స్వాగతం పలికారు. ఇక్కడ వ్యాపారం చేయడం వల్ల కలిగే వివిధ ప్రయోజనాలను వారికి వివరించారు. శ్రీసిటీ సందర్శన ఏర్పాటు పట్ల జేటీవో ప్రతినిధి ప్రవేష్‌షా శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. టూత్ బ్రష్‌లు, టీ, కాఫీ, చాక్లెట్లు, కార్న్‌ఫ్లేక్స్, ఎఫ్ఎంసీజీ, మొబైల్ ఫోన్లు, ఏసీలు, కార్లు, మెట్రో రైళ్ల వంటి వివిధ రకాల ఉత్పత్తుల తయారీ గురించి తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పర్యటనలో భాగంగా వీరు శ్రీసిటీ అధికారులతో సమావేశమై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం ఏఎల్ఎఫ్, రాక్‌వర్త్, జెడ్‌టీటీ తదితర పలు పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ సందర్శనకు వచ్చిన వారిలో మరింత మంది ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు కూలీల మృతి



మృతులు సత్తిబాబు, శ్రీధర్

రేణిగుంట, ఫిబ్రవరి24: మండలంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు కూలీలు మృతి చెందారు. గాజులమండ్యం ఎస్ఐ దర్మారెడ్డి కథనం మేరకు.. రేణిగుంట -పుత్తూరు మార్గంలోని అల్లికేశం వద్ద శనివారం తెల్లవారు జామున కాకినాడ జిల్లాకు చెందిన సత్తిబాబు(55 ట్రాక్టర్‌కు చెరకు లోడింగ్ చేస్తున్నాడు. ఆ సమయంలో పుత్తూరుకు వెళుతున్న ఆర్టీసీ ఆయన్ను ఢీకొంది. దీంతో సత్తిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

తిరుపతి రోడ్డులో:

ఏర్పేడు మండలం పాపానాయుడు పేట నుంచి తిరుపతికి సెంట్రింగ్ సామాన్ల కోసం ఓ లగేజ్ ఆటో శనివారం ఉదయం తిరుపతికి బయలుదేరింది. రేణిగుంట -తిరుపతి రోడ్డులో వాల్‌మార్ట్ వద్ద వెళుతుండగా వెనుకనుంచి ఓ కారు ఢీకొంది. ఆటోలోవున్న మునగలపాళెం గ్రామానికి చెందిన జి.శ్రీధర్(45) డివైడర్‌పై పడి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వెంకటముని, అర్జున్‌లకు గాయాలయ్యాయి. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.